# ఒక రోజు

ఆ రోజు ఆదివారం. కాలేజి లేదుగదాని నా మిత్రుడు శ్రీనివాసాన్ని కల్సుకుందామని అతని గదికి వెళ్ళాను.

నేను వెళ్ళేటప్పటికి మిత్రుడు శ్రీనివాసన్ చక్కగా డ్రెస్సువేసుకొని, సోఫాలో కూర్చుని, ఆ రోజుటి ఆంధ్రప్రభ చూస్తున్నాడు. పేజీలను త్రిప్పుతూ సిగిరెట్టు పొగ రూమునిండా నింపుతున్నాడు. నన్ను చూడగానే చదువు వదలి, "సినిమాకు వెళదాం పదవోయ్" అంటూ లేచి నిల్చున్నాడు. అంతలోనే నేను మరొక కుర్చీలో కూర్చొని ఆంధ్రప్రభ చదవటం ప్రారంభించాను అతను మరొక సిగిరెట్టు కాల్చి, సోఫాలో కూర్చున్నాడు.

ఆంధ్రప్రభ చదువుతున్నాను. దానిలో చాలవరకు ఒకవైపు ప్రధాని నెహ్రూగారికి విదేశాలలో అఖండ స్వాగతాలు. మరోవైపు ఆంధ్రదేశమంతటా, తుఫాను, ముఖ్యంగా కృష్ణ, గోదావరి జిల్లాలలో ఘోరమరణాలు, గుండెలవిసిపోయేటట్లు కనుపించే పెద్ద పెద్ద చిత్రాలు, వేలకొలది ఆంధ్రప్రజలు అటుతుఫాను, ఇటు వరదలకు గురై, నిలువ నీడలేక, చెట్లక్రింద, గొప్పవారి భవనాల పంచలలో తల దాచుకుంటున్నారు!

బాగున్న రేపన్ రోజుల్లోనే తిండి సరిగా లేదు. ఇక యీ భీభత్సంలో ఎక్కడ్నుండి వస్తుంది? ప్రభుత్వం వారు తమ శక్తివంచన లేకుండా, అన్ని విధాల తోడ్పడుతున్నారు. అసలే తిండిలేక మలమలమాడుతున్న ఈ రోజులలో నవధాన్యాలుపండే ఆంధ్ర ప్రాంతంలో, అందులో ధాన్యం సమృద్ధిగా పండే జిల్లాలలో సర్వనాశనం జరిగింది.
ఎందరు తల్లులు, తమ బిడ్డలను కానక, అల్లాడుతున్నారో! ఎందరు యువతులు, తమ భర్తలకు దూరమై విలపిస్తున్నారో! ఎన్ని వందల నోరులేని పశువులు తమ లేదూడలను కానక తలెత్తి అరుస్తూ కన్నీరు కారుస్తున్నయో!

ఎంతమంది స్వార్థపరులు, అదనుచూచి, తమ యినుప పెట్టెలను నింపుతూ పేదలరక్తాన్ని పెట్టెలకు తిలకమిడుతూ మంగళ హారతులిస్తున్నారో! పాపం, జవసత్వము లుడిగిపోయి వృద్ధజీవులు నోరులేని పసిపాపలు, చలి గాలిలో చెట్లక్రింద ఎంత పెట్టున రోదన చేస్తున్నారో! అనే ఊహలన్నీ నాలో బయలుదేరి, ఏమీ చేయలేని నా హృదయాన్ని దహించివైచి, నా కంట వెంట రెండు నీటి చుక్కల్ని మాత్రం రాల్ప గలిగినాయి.

అది గమనించిన నా మిత్రుడు, విచిత్రంగా నా వైపు చూస్తూ "ఏమిట్రోయి?" అన్నాడు. నేను హీనంగా అతని వైపుచూస్తూ "ఆంధ్రదేశంలో తుఫాన్" అనే పెద్ద అక్షరాల వరుసను చూపించాను. అందుకతను ఏ మాత్రం సానుభూతి చూపలేదు సరి, గదా ఒక విధంగా నవ్వి "అందుకని నీవు విచారించటమెందుకు? నీ బంధువు లెవ్వరైనా...? సరేలే, సినిమాకు వెళదాం" అంటూ లేచి నిలుచున్నాడు. దానికి నాకు ఆట్టే ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే అతను పెద్ద ధనవంతుని కుమారుడు, ధనవంతులకు వుండవలసిన సహజ స్వభావము అది గనుక. అందుకేతోటి ఆంధ్రులు అలా బాధలు పడుతుంటే ఎంతైనా సహాకరించ గలిగిన అతను నిర్లక్ష్యంగా అలా ఒక నవ్వు నవ్వాడు.

అతను, తన ఆనందం కొరకు ఎంత డబ్బు ఖర్చు చేయటంలేదు? ఎన్ని విధాలుగానో వేలకు వేలు ధనం పాడు చేస్తుండటం లేదు? మొన్న తన సమ ఉజ్జీ అయిన స్నేహితుని గృహప్రవేశానికి వందలకు వందల రూపాయలను వ్యయపరచి కానుకలు పంపలేదు? తుఫాను పీడితులకు ఇతను ఎందుకు సహాయం చేయగూడదు? ఇలాంటి వారందరికి పేద ప్రజలమీద ప్రీతిగలిగితే ఎంతబాగుండేది? అనుకుంటూ అతన్ని చూచి, "ఏ మోయ్ శ్రీను! ఈ సమయంలో నీవెంతైనా సహాయం చేయగలవు, ఏదో నీకు తోచింది, కొంత ధనం కాని, ధాన్యంగాని, సహకారసంఘానికి అందజేయి!" అని ప్రాధేయ పూర్వకంగా చెప్పాను. దానికి తను తన విలువైన కోటుసర్దు కుంటూ,

"మన కెందుకోయి-యీలేని పోని బాధ. ఏదో గవర్నమెంటు తంటాలు పడ్తారులే." అని ఎంతో సులువుగా అన్నాడు.

నువు చేసేది చేయి, నీవు చేస్తానంటే గవర్నమెంటు వద్దంటుందా!

"మనం పిచ్చివాళ్ళం. పెద్దవారుండగా మన కెందు కొచ్చిన క్షోభ! మా ఫాదర్ ఒప్పుకోడోయ్"

తనకేదో మహాదయ ఇతరులమీద ఉన్నట్లు ఒక వెధవ నవ్వు నవ్వి "కమాన్"అంటూ నన్ను తన చిన్న కారులో కూర్చోపెట్టుకున్నాడు. సినిమాకు టైం అయి పోయిందంటూ, వెల్లింగ్టన్లో స్ట్రేంజిబ్రదర్సు, మ్యాటినీకి వెళ్దాం అని అక్కడికి దారితీశాడు.

నాకేమీ మతిపోక కారులో కూర్చుని యున్నాను. అప్పుడేకారు సినిమాహాల్ని సమీపించింది.. కారు ఆగీ ఆగక మునుపే, ఇరువురు యువతులు, సుమారు మూడు గంటల కాలంలో, ఎర్రని ఎండలో దిగజారిపోయే చెమటతో, ఎండ వేడికి కందిపోయిన లేత ముఖాలతో, మావద్ద కొచ్చి ఒక నోటీసు మా చేతి కిచ్చారు. చూశాను. ఏ సమస్య నన్నంతవరకూ ఎదుర్కొని, ఏమీ చేయలేని నా మనస్సును దహించివైచిందో, అదే సమస్య...ఆ నోటీసులో ఉంది... "ఆంధ్రలో తుఫాన్ పీడితుల సహాయార్థం విరాళం," ఆ వసూలు చేసె బాలికలు, మహిళా సంఘం వారని నాకు వెంటనే అర్థమయింది. నాకు తెలియకుండగానే నా చేయి చొక్కా జేబులోకి పోయి రాగి కానీయైన దొరకక, వెంటనే కిందికి దించుక పోయింది. కుంగిపోయే ముఖంతో శ్రీనివాసాన్ని చూచాను.—అతని దృష్టి పాపం అమాయికంగా నిల్చొని, మరెవరన్నా ధర్మాత్ములు వస్తారేమోనని నలువైపుల చూస్తున్న చెల్లెంద్ర అంగసౌష్టం మీదకు సోకుతుంది. ఆ దృశ్యానికి, నావల్లు మండిపోయి గభామని, "ఏమిటోయ్?... ఆ చేసే సహాయమేదో త్వరగా చేయి, పాపం వెళతారు." అన్నా దాని కతడు తృళ్ళిపడి మయికంలోనుండి లేచి, నోటీసు యువతుల కిచ్చి...ఏమీ లేదన్నట్లు పెదవులు విరిచి, విషపు నవ్వొకటి నవ్వి నావైపు చూశాడు. ఆ యువతులు తమ ధర్మ డబ్బాలను నావైపు చూపారు. ఏం చేయను? వారిసహనానికి, అబలలైకూడా శ్రీనివాసన్లాంటి విషవృక్షాల్ని ఎదుర్కొంటూ, ధైర్యంగా తోటి మానవులకు, పేద ఆంధ్రుల సేవాకార్య దీక్షకు, ఎంతో పొంగిపోతూ, వారికి సహస్ర ధన్యవాదాలన్నట్లు ప్రేమ సూచకంగా తలవంచి, ఒక్క నమస్కారం మాత్రం చేయగలిగాను. ఆ యువతులు నా అసహాయతకు కొంత బాధపడి, చిరునవ్వుతో, ఉషారుగా, మరొకచోటుకు వెళ్ళి ఇలాగే యాచిస్తున్నారు. దానికి నాకు వల్లుపొంగి పోయింది. నాకూ ఒక చెల్లెలుంటే "ఇలాగే"పంపి, నా చెల్లిగూడా, తోటి మానవులకు సహాయం చేయగలుగుతుందని ఎంతో గర్వపడే వాడ్నే! నడిస్తేనే అలసి పోయే అబలలు; తుఫాన్ పీడితుల సహాయార్థం, అలా ధైర్యంగా పదిమంది మగవాళ్ళలోకి వచ్చి తమకార్య దీక్షను కొనసాగిస్తున్నారు.

వారికి కొంతదూరంలో మరొకజట్టు ఇలాగ ధర్మ డబ్బాలతో వసూళ్లు చేస్తున్నారు. అప్పటి నా స్థితి శ్రీనివాసాన్ని చూచి నవ్వాలో ఏడ్వాలో బోధ పడలేదు. అంతలోనే అతను, తన రిజ్వరు చేసిన టిక్కెట్టు తీసుకొని నాకు ఇంకొక టిక్కెట్టు తీసుకోమని కొంత డబ్బు నా చేతి కిచ్చాడు. తీసుకొన్నాను... ఎంతిచ్చాడో కూడా చూడ లేదు; డబ్బు చేతిలో పడగానే పరమానందంతో నా కాళ్ళు ఆ యువతుల వద్దకు పరుగెత్తాయి. అంత కన్నా వేగంగా నాచేయి, ఆ ధర్మడబ్బా మీదకు పోయింది...రిక్త హస్తాలతో తిరిగివచ్చి శ్రీనివాసన్తో "నేను సినిమాకు మాను కున్నానోయ్! నేనుగూడా వచ్చాననుకొని నీవు ఒక్కడవే వెళ్ళ"మని గబగబా ఇవతలకు వచ్చాను. నడుస్తున్నాను. దారి పొడుగునా, అదే ఆలోచన. "నా కంటె, చెల్లెంద్ర యిన ఆ యువతులే కొన్నిరెట్లు మేలు. వాళ్ళందరు వారి వారి శక్తికొలది కష్టజీవులకు సహాయం చేస్తున్నారు...ఎంత సంతోషం ఎంత పట్టుదలతో తమ కార్యాన్ని కొనసాగిస్తున్నారు? బేష్,..."ఇలాగే అనుకుంటూ, నేను, నాతోటి ఆంధ్రులకు కొంత సహాయం చేయగలిగాను గదాని సగర్వంగా, ఆనందిస్తూ, నా రూము చేరాను—

—సోమ్.

★